# సత్య వాక్కు

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది; మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

**ఇంగ్లీషు THE VOICE OF TRUTH**

సోమవారము } 9-00 to 9-15 p. m.
బుధవారము

**హిందీ — SATYA SUSAMACHAR**

మంగళవారము
గురువారము } 9-00 to 9-15 p. m.
శుక్రవారము

ఆదివారము — 1-30 to 1-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.

గురువారము } 6-45 to 7-00 p. m.
శుక్రవారము

**మళయాళం — THE VOICE OF TRUTH**

మంగళవారము } 3-45 to 4-00 p. m.
శుక్రవారము

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరండి. ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయుండి :

SATYA VANI
P.O. Box. 80
KAKINADA - 533 001

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box 80, KAKINADA-533 001.**

*Editor* — J. C. CHOATE

*Managing Editor* — JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity.

సంచిక **4** నవంబరు **1982** సంపుటి **3**

## సంపాదకీయము

### కొర్నేలి, అతని యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరా?

*( Did Cornelius and His Household Receihe the Baptism of the Holy Spirit ? )*

కొర్నేలి, అతని యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరా? యనే ప్రశ్నను మనం తరుచు వినుచుందుము. కొందరు అవునందురు, మరికొందరు కాదందురు. వారు దానిని పొందితే ఎందు నిమిత్తము పొందారు?

అపొస్తలుల కార్యములు 10, 11 అధ్యాయములలో కొర్నేలి, అతని యింటివారు మార్పు జెందుటను గూర్చి చదువు నప్పుడు అతడొక అన్యుడని నీవు గమనించగలవు. అతడొక శతాధిపతి, సత్పురుషుడు, అతడు తన యింటి వారందరితో కూడ దేవునియందు భయభక్తులు గలవాడై యుండి, ప్రజలకు బహుధర్మము చేయుచు ఎల్లప్పుడు

ప్రార్థన చేయువాడు. అయినను సరే తాను, తన కుటుంబము నశించిన స్థితిలో యుండిరి. అయితే వారు మంచివారు, అన్యజనులు, సువార్త అవుసరమైన వారు గనుక వారి యెడల ప్రభువు ప్రత్యేక లక్ష్యముంచెను. ఉన్న స్థితిలోనే ప్రభువు వారిని రక్షించ లేదు. వ్యక్తిగతంగా సువార్తను వారికి అందించ లేదు. అయితే పేతురును పిలువ నంపించుమని కొర్నేలికి తెలియజెప్పుట కొరకు దూతను పంపి ఆయన సహాయపడెను. ఈలోగా పేతురు యొప్పేలో చర్మకారుడైన సీమోను ఇంటిలో యుంటూ ప్రార్థన చేయుటకు మిద్దెమీదికి వెళ్లెను. అతడు మిక్కిలి ఆకలిగొని భోజనము చేయగోరెను; ఇంటివారు సిద్ధము చేయుచుండగా అతడు పరవశుడై భూమియందుండు సకల విధములైన జంతువులను చూచెను. అప్పుడు - పేతురూ, నీవు లేచి చంపుకొని తినుమని ఒకశబ్ద మతనికి వినబడెను. పేతురు మోషే ధర్మశాస్త్ర ప్రకారము పెరిగినందున అపవిత్రమైన జంతువులను తినుటకు నిరాకరించెను. దేవుడు పవిత్రము చేసినవాటిని నీవు నిషిద్ధమైన వాటిగా ఎంచవద్దని మరల రెండవమారు ఆ శబ్దము అతనికి వినబడెను. ఈలాగు ముమ్మారు జరిగెను. ఈ సమయములో కైసరయ నుండి కొర్నేలి పేతురుకొరకు పంపిన మనుష్యులు వచ్చి అతనికొరకు విచారించుచుండిరి. అయితే దీని యంతటిలోను ప్రభువు పేతురుకు నేర్పుచున్న పాఠములేవి? ధర్మశాస్త్రము నెరవేర్చబడినందున ఇక అపవిత్రమైన జంతువు లేమీ లేవని ఆయన అతనికి చెప్పుచుండెను. క్రీస్తు అందరి కొరకు చనిపోయినందున ఇప్పుడు యూదులు అన్యజనులమధ్య భేదమేమీ లేదని ఆయన అతనికి చెప్పుచుండెను.

పేతురు వీటన్నిటి విషయమై ఆలోచించుచుండగా, నీవు సందేహింపక వారితో వెళ్లుమని ఆత్మ పేతురుకు చెప్పెను. అప్పుడు పేతురు యొప్పేవారైన కొందరు సహోదరులు వారితో వెళ్లిరి. వారు కైసరయలో ప్రవేశించి కొర్నేలి తన బంధువులు ముఖ్య స్నేహితులతో

సమావేశమై యుండుట కనుగొనిరి. కొర్నేలి పేతురు పాదములమీద పడి నమస్కారము చేయగోరెను గాని, లేచి నిలువుము నేనుకూడ నరుడనే అని చెప్పి పేతురు అతని లేవనెత్తెను.

అప్పుడు పేతురు, అన్యజాతివానితో సహవాసము చేయుట యూదునికి ధర్మంకాదని, అయితే ఏ మనుష్యుడు నిషేధింప దగినవాడని, అపవిత్రుడని చెప్పకూడదని దేవుడతనికి చూపించి యున్నాడనెను. అప్పుడు కొర్నేలి, పేతురును పిలువ నంపించుమని ప్రభువు యిచ్చిన హెచ్చరికలను వివరించెను. నీవు వచ్చినది మంచిది. ప్రభువు నీకు ఆజ్ఞాపించిన వన్నియు వినుటకై మేమందరము కూడి యున్నామని అతడు చెప్పెను. అప్పుడు పేతురు వారికి బోధింప నారంభించెను.

పేతురు క్రీస్తును గూర్చియు, ఆయన సువార్తను గూర్చియు బోధించుచుండగా, పరిశుద్ధాత్ముడు అతనిబోధ విన్నవారందరి మీదికి దిగెను. పరిశుద్ధాత్మ అన్యజనులమీద సయితము కుమ్మరింపబడుట చూచి పేతురుతో యున్నవారు విభ్రాంతి నొందిరి. పరిశుద్ధాత్మ పొందినందున కొర్నేలియు, మిగతావారును భాషలతో మాటలాడుచు, దేవుని ఘనపరచుచుండిరి. అప్పుడు యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని పేతురు వారిని ఆజ్ఞాపించెను.

మనం ఇంకా ముందుకు వెళ్ళకముందు ఇక్కడ కొన్ని సంగతులను గమనించవలసి యున్నది :

1. సువార్త కలిగినవారి నుండి సువార్త అవుసరమైన వారు వినునట్లు ప్రభువు ఒక అవకాశమును అద్భుతరీతిగా కల్పించెను.

2. మనం చదివిన సంఘటనలో, ధర్మశాస్త్రము ఇక అమలులోలేదు గాని ఇప్పుడు సువార్త అందరికీ చెందునని చూడగలము.

3. ఇక్కడ అన్యజాతివారిలో నుండి ప్రప్రథమముగా మార్పు చెందిన వారున్నారు.

4. యూదుల వలెనే అన్యులనుకూడ ప్రభువు అంగీకరించునని నిరూపించుటకొరకు మొదట్లో అపొస్తలులమీద పరిశుద్ధాత్మ ఎట్లు కుమ్మరింపబడెనో అట్లే కొర్నేలి, అతని యింటివారిమీద కూడ కుమ్మరింపబడెను.

5. కొర్నేలి, అతని యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరని నిరూపించుటకు వారు భాషలతో మాటలాడిరి.

ఇంకా ముందుకువెళ్లి మరికొన్ని సంగతులను గమనిస్తాం. ఒకటి, కొర్నేలికి అతని యింటివారికి ఏమి జరిగిందో అది పెంతెకొస్తు నాడు మూడువేలమందికి జరిగిన దానికి వేరుగా యున్నదని మనము చూడగలము. అపొ. కా. 2వ అధ్యాయములో, పేతురును మిగిలిన అపొస్తలులును గొప్ప జనసమూహమునకు బోధించిరి. వారిలో సత్యమునుగూర్చి నమ్మకము ఏర్పడినప్పుడు, వారేమి చేయాలో తెలిసికొనగోరిరి. వారు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని అప్పుడు వారు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురని వారికి చెప్పబడెను. కొర్నేలి, అతని యింటివారి సందర్భములో వారు ప్రభువు వాక్యమును వినిరి, పరిశుద్ధాత్మను పొందిరి. అప్పుడు వారు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపింపబడిరి.

ఆ "వరము" ఏమిటో అనుదాని విషయమై మరొక సంగతి ఇక్కడ తలెత్తును. ఈ రెండు సందర్భములలో, అపొ. కా. 2, అపొ. కా. 11 లో లేఖకుడు పరిశుద్ధాత్మ వరమును గూర్చి చెప్పుచున్నాడు. ఈ రెండు సందర్భాలలోను వారు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరా ? లేక అద్భుతంగాగాక సామాన్య పరిమాణములో పరిశుద్ధాత్మను పొందిరా ? ఈ రెండు సందర్భములలోను పరిశుద్ధాత్మ ఒక వరమేగాని, అపొ. కా. 2 లో బాప్తిస్మము పొందిన

మూడువేలమంది అనాద్భుత పరిశుద్ధాత్మ వరమును (Non-miraculous measure of the Holy Spirit), కొర్నేలి యింటివారు అద్భుతంగా పరిశుద్ధాత్మ వరమును (Miraculous measure of the Holy Spirit) పొందిరియని మనము గమనించగలము. కొర్నేలి యింటివారు భాషలతో మాటలాడిరి గనుక వారు అద్భుతరీత్యా పొందిరి.

కొర్నేలి, అతని యింటివారు మార్పుజెందిన సందర్భమును పేతురు మరల వల్లించినప్పుడు ఇట్లు వివరించెను: "నేను మాటలాడ నారంభించినప్పుడు పరిశుద్ధాత్మ మొదట మనమీదికి దిగిన ప్రకారము వారిమీదికి దిగెను. అప్పుడు - యోహాను నీళ్లతో బాప్తిస్మమిచ్చెను గాని మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురని ప్రభువు చెప్పినమాట నేను జ్ఞాపకము చేసికొంటిని. కాబట్టి ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచిన మనకు అనుగ్రహించినట్టు దేవుడు వారికికూడ, సమానవరము అనుగ్రహించి యుండగా, దేవుని అడ్డగించుటకు నేను ఏపాటివాడనని చెప్పెను" (అపొ. కా. 11:15-17). ఇక్కడ పరిశుద్ధాత్మ ఎవరిమీద దిగెను? కొర్నేలి యింటవారి మీదనేగదా. వారిమీద ఆయన ఎట్లు దిగెను? మొదటి అపొస్తలులమీద దిగినట్లే వారిమీద దిగెనని పేతురు చెప్పెను. ఈ మొదట యెప్పుడు? అది అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన పెంతెకొస్తు దినమే. ఆనాటినుండి అందరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందలేదు. ఏలనంటే ఉదాహరణ కొరకు పేతురు దాని ఆరంభమునకు వెళ్ళవలసి వచ్చెను. అందరు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందుచున్నయెడల, కొర్నేలి యింటివారికి జరిగిందేమీ వేరుగా లేకపోవును. సరిగదా విశ్వాసులందరివలెనే కొర్నేలి యింటివారుకూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి యని పేతురు చెప్పేవాడు. అయితే మొదట మనవలెనే కొర్నేలి యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరని

అతడు చెప్పెను. దానిని బలపరచుటకుగాను యోహాను నీళ్ళతో బాప్తిస్మమిచ్చెను గాని మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురని ప్రభువు చెప్పిన మాటలను అతడు వినియోగించెను.

తరువాత యెరూషలేములో అన్యజనులనుగూర్చి, సున్నతిని గూర్చి మోషే ధర్మశాస్త్రము ననుసరించుటనుగూర్చి చర్చ జరిగెను. దానినిగూర్చిన రికార్డు ఇట్లున్నది: "అప్పుడు అపొస్తలులును, పెద్దలును ఈసంగతినిగూర్చి ఆలోచించుటకు కూడి వచ్చిరి. బహుతర్కము జరిగిన తరువాత పేతురు లేచి వారితో ఇట్లనెను. సహోదరులారా, ఆరంభమందు అన్యజనులు నా నోట సువార్తవాక్యమువిని విశ్వసించులాగున మీలో నన్ను దేవుడేర్పరచుకొనెనని మీరు తెలియును. మరియు హృదయములను ఎరిగిన దేవుడు మనకు అనుగ్రహించినట్టుగానే వారికిని పరిశుద్ధాత్మను అనుగ్రహించి వారినిగూర్చి సాక్ష్యమిచ్చెను. వారి హృదయములను విశ్వాసమువలన పవిత్రపరచి మనకును వారికిని ఏభేదమైనను కనుపరచలేదు" (అపొ. కా. 15 : 6-9). గనుక ఈవిషయం దానితో పరిష్కరించబడింది. మనం ఇంతవరకు చదివిన దానిభావం యేమంటే, అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి, అల్లే అన్యజనులైన కొర్నేలి, అతని యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి. యూదులవలెనే అన్యజనులు కూడ దేవునికి ఇష్టులని తెలియజేయుటకు దేవుడీపద్ధతిని వినియోగించెను. పెంతెకొస్తునాడు బాప్తిస్మముపొందిన మూడువేలమందికూడ పరిశుద్ధాత్మ అను వరమును పొందిరి, గాని అది అద్భుతరూపకమైనదికాదు. కాని కొర్నేలి యింటివారు అద్భుతరూపకమైన పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి యనికూడ దాని భావము. ఏలయనగా వారు అన్యభాషలతో మాటలాడసాగిరి, దీనివలన అన్యజనులుకూడ యూదులవలెనే దేవుని వలన అంగీకరించబడిరని పేతురుకు నమ్మకము కలిగినది.

అయితే ఈరోజు నీయొక్కయు, నాయొక్కయు సంగతియేమిటి? ప్రభువుకు విధేయులమైనప్పుడు మనము దేనిని పొందుదుము? పరిశు

ద్ధాత్మ బాప్తిస్మమా! లేక అద్భుత రూపముకాని పరిశుద్ధాత్మయను వరమా? మనము అద్భుతరూపముకాని పరిశుద్ధాత్మ వరమును పొందుదుము. పరిశుద్ధాత్మ బాప్తిస్మము మనకెన్నడు వాగ్దానము చేయబడలేదు, సరికదా దాని యవుసరత మనకు లేదు. అందువలన ప్రభువుకు విధేయులమైనప్పుడు ఆయన మనకేమి వాగ్దానము చేసాడో దానితో అనగా రక్షణ, పరిశుద్ధాత్మ అను వరముతో సంతృప్తి జెందవలెను. దానికంటె ఎక్కువపొందితినని యనుకొనువాడు మోసగించబడినవాడు.

---

## మార్పు జెందుటలో పరిశుద్ధాత్ముడు

### *( The Holy Spirit in Conversion )*

— పెర్రి కోతమ్.

ఎవడైనను దేవుని రాజ్యపౌరుడు కావలెనంటే, సంఘ సభ్యుడు కావలెనంటే అతడు ఆత్మీయముగ పునర్జన్మించవలెను, ఆత్మమూలముగా జన్మించవలెను. నీకొదెముతో మాట్లాడుచు దేవుని రాజ్యములో ప్రవేశించుటకు ఒకడు తిరిగి జన్మించవలెనని యేసు ఇట్లు ఉద్ఘాటించెను: "ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:5).

మార్పు జెందుటలో లేక క్రొత్త జన్మలో పరిశుద్ధాత్ముడు తన ప్రభావమును ఉపయోగపరచునని అందరు అంగీకరింతురు. మార్పు జెందుటలో పరిశుద్ధాత్ముడు దేవుని వాక్యమునకు అదనముగాను ప్రత్యేకముగాను పని చేయునని కొందరు బోధింతురు. ఈ పాఠములో, పాపియొక్క హృదయముపై పరిశుద్ధాత్ముడు యెల్లప్పుడు వాక్యముద్వారా మాత్రమే పనిచేయునని లేఖనములు బోధించు

చున్నట్లు నూచింపబడును. మార్పు జెందుటలో పరిశుద్ధాత్ముడు మర్మయుక్తముగా, ప్రత్యక్షముగా పనిచేయునని లేఖనములు బోధించుట లేదు.

## ఆత్మ మరియు ఆయన సాధనము

పరిశుద్ధాత్ముడు ఒక మర్మయుక్తమైన ప్రభావము (Mystical influence) గాక దైవ వ్యక్తియని బైబిలు బోధించుచున్నది. దైవత్వములో ఆయన ఒక వ్యక్తి. ఆయన తండ్రితోను, కుమారునితోను ఏకమై యున్నాడు; ఆయన వ్యక్తిత్వము, జ్ఞానము, దైవత్వము గల వ్యక్తి. వ్యక్తిత్వముగల ఆయనను గూర్చి చెప్పదగిన సంగతులే ఆయనను గూర్చి చెప్పబడెను (అపొ. కా. 17:29); యోహాను 14:16; 16:7-14; 4:24; రోమా 8:26, 27; ఎఫెసీ 4:30; 1 తిమో 4:1; అపొ. కా. 20:23; 21:11).

యేసు పరిశుద్ధాత్మని గూర్చి, "ఆయన వచ్చి పాపమును గూర్చియు నీతినిగూర్చియు తీర్పునుగూర్చియు లోకమును ఒప్పుకొనజేయును" అని చెప్పెను (యోహాను 16:8). అయితే ఆత్మ పాపమును గూర్చి యెట్లు ఒప్పుకొనజేయును? "ధర్మశాస్త్రమువలన పాపమనగా ఎట్టిదో తెలియ బడుచున్నది" (రోమా 3:20; 7:7). పాపమును ఒప్పుకొనజేయుటలో పరిశుద్ధాత్ముడు ధర్మశాస్త్రమును ఒక సాధనముగా వినియోగించును. పరిశుద్ధాత్ముడు తన పనిని జరిగించు సాధనము దేవుని వాక్యము. పాపమునుగూర్చి ఒప్పుకొనజేయు మరొక మార్గములేదు.

ఆత్మకును ఆత్మయొక్క మాటలకును గల వ్యత్యాసమును మనము మనస్సునందుంచుకొనవలెను. ఆత్మ ఒక వ్యక్తి. మాటలు ఒక సాధనము. ప్రజలు వట్టివాక్యము వలన మాత్రమే లేక ఆత్మవలన మాత్రమే మార్పు నొందరుగాని వాక్యముద్వారా పనిచేయు ఆత్మ వలన మార్పు నొందుదురు. మనుష్యుల హృదయములపై పనిచేయునప్పుడు ఆత్మ వినియోగించు పరికరము, దేవుని వాక్యము.

ఒక ఉదాహరణను గమనించుము: "ఆనంద్ తన చెట్టును ఒక గొడ్డలితో నరుకును." ఆనంద్ చెట్టును నరుకును; గొడ్డలి చెట్టును నరుకును. ఆనంద్ అను నతడు తన శక్తిని పరోక్షముగా ఒక సాధనము ద్వారా వినియోగించి చెట్టును నరుకును. ఇప్పుడీ ఉదహారణను పరిశుద్ధ లేఖనముల కుపయోగించుము. "వాక్యము ఆత్మయొక్క ఖడ్గమై యున్నది" (ఎఫెసీ 6:17). మార్పుజెందుటలో ఆత్మ హృదయమును ఒప్పింపజేయును. అయితే ఆత్మ, ఈవ్యక్తిని తన ఖడ్గము లేకుండా ఒప్పించగలడా? లేదు. పెంతెకొస్తునాడు మార్పుజెందిన వారు ఆయన పనికి మంచి మాదిరిగా యున్నారు (అపొ. కా. 2). ఆ దిన మందు హృదయములు నొచ్చుకొనబడెను. ప్రజలు ఒప్పింపజేయ బడిరి మరియు మూడు వేలమంది ప్రభువు తట్టు తిరిగిరి. ఈ ప్రజలను మార్చినశక్తి, సువార్త. ఆత్మ ఆయన మాటలద్వారా వారిని కదలించెను. పరిశుద్ధాత్మడే పనిని జరిగించెను గాని ప్రత్యక్షముగా కాదు; ఆయన తన ఖడ్గమును వినియోగించెను. అపొస్తలుడైన పేతురుద్వారా ఆత్మచే ప్రకటించబడిన దేవునివాక్యము ఈ ప్రజల హృదయములను నొచ్చుకొనునట్లు చేసెను. బైబిలు ఇట్లనుచున్నది: "వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని, సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడిగిరి" (అపొ. కా. 2:37). పరిశుద్ధాత్మావేశమువలన క్రీస్తే దేవుని కుమారుడని పేతురు బోధించెను. పేతురు యొక్క మాటల వలన ఆత్మ వారిని విశ్వాసులుగా చేసెను; వారు క్రీస్తును చంపించితిరని వారిని ఒప్పింపజేసెను. మరియు దేవుడాయనను మృతులలో నుండి లేపెనని నిర్ధారణ యిచ్చెను. అతని ప్రసంగములో పేతురు ఆత్మయొక్క ఖడ్గమును, దేవుని వాక్యమును ఉపయోగించెను (అపొ. కా. 7:54).

ఆత్మ బాప్తిస్మము అపొస్తలులకే కలిగెనుగాని పాపులకు కాదు. వారిని సర్వ సత్యములోనికి నడిపించుటయే దాని ప్రయోజనము.

ప్రజలకు పరిశుద్ధాత్మ బాప్తిస్మము అవసరమై యున్నదని పేతురు పలుకలేదు. గాని వారు క్రీస్తునందు విశ్వసించిన తరువాత, మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు బాప్తిస్మము పొందవలెనని అతడు చెప్పెను (అపొ. కా. 2:36-38). ఆత్మ యొక్క ఆజ్ఞలకు విధేయులైన వారందరు రక్షింపబడి సంఘముతో చేర్చబడిరి (అపొ. కా. 2:41, 47). గనుక ఈ ఉదాహరణద్వారా పాపి మారుమనస్సు పొందుటలో పరిశుద్ధాత్ముడెట్లు పనిచేయునో తెలిసికొనగలము. మార్పు జెందుటలో మనుష్య జ్ఞానేంద్రియములను పరిశుద్ధాత్ముడు నిర్లక్ష్యము చేయడు. గాని ఈ జ్ఞానేంద్రియములద్వారా మానవుని పాపములను గూర్చి ఒప్పించి అతని విధేయతకు నడిపించును. అపొస్తలుల కార్యములలో క్రొత్తజన్మ నొందినవారి యుదాహరణలను చదువుటద్వారా మనము ఆత్మ పనిచేయు విధానమును తెలిసికొనగలము.

ఆ మూడువేల మంది నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించిరా? అవునని అందరు అంగీకరింతురు. అయితే ఎట్లు! ప్రత్యక్షముగా దేవుని ఆత్మతో నింపబడిన మనుష్యుడొకడు వాక్యమును బోధించెను; వారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమున జరిగిన సంఘటనలను మనము క్లుప్తముగ చెప్పుకొనవచ్చును: 1) యోహాను 16:7 15 లో చేయబడిన వాగ్దానమును నెరవేర్చుచు పరిశుద్ధాత్ముడు అపొస్తలులపై దిగెను. 2) అపొస్తలులు ఆత్మచే నింపబడినవారై సువార్తను బోధించిరి. సువార్తద్వారా ఆ జనసమూహములను ఆత్మ నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు ఒప్పింపజేసెను. 3) చేయబడిన బోధ ప్రజల మనస్సులలో పనిచేసెను; వారియొక్క నమ్మికను, భావములను మార్చి యేసే ప్రభువని, క్రీస్తని విశ్వసించునట్లు చేసెను. 4) అప్పుడు వారు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని ఉపదేశించబడిరి. దేవుని ఆత్మచే వాక్యము

ద్వారా జనింపజేయబడిన వారందరు బాప్తిస్మము పొందిరి (నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించిరి). అట్టివారు దేవుని రాజ్యములో ప్రవేశింపజేయబడిరి.

అందువలన: 1) పరిశుద్ధాత్మ డొక వ్యక్తి 2) సువార్త ఆత్మ వినియోగించిన సాధనము 3) సువార్తను మనుష్యులు ప్రకటించిరి. 4) పాపిచే దేవుని వాక్యము అంగీకరించబడెను. తిరిగి జన్మించుటలో ఈ నాలుగు అంశములు కలసి పనిచేయుట మనము ఎల్లప్పుడు చూడగలము. అవిశ్వాసములో యెవడును తిరిగి జన్మించడు. వినయముతో దేవుని చిత్తమునకు విధేయుడయ్యేవరకు క్రొత్తగా జన్మించిన వాడెవడును బైబిలునందు మన కగుపడడు. మనుష్యులు సువార్తను విని, విశ్వసించి, విధేయత చూపించునప్పుడు వారు పైనుండి జన్మించినవారు, పరిశుద్ధాత్మని వలన తిరిగి జన్మించినవారు. అపొస్తలుల యొక్క బోధప్రకారము మారుమనస్సు నొందిన విశ్వాసులు నీటిలో ముంచడము పొందినప్పుడు వారు పరిశుద్ధాత్మని నడిపింపు, ప్రభావమువలన ప్రవర్తించుచున్న వారు.

## మార్పు చెందుటలో ఆత్మ, వాక్యము

:: మార్పు జేయుటలో ఆత్మ యెల్లప్పుడు వినియోగించు సాధనము సువార్త ;

1. ప్రతి ప్రాణికి మొదట జననము కలదు. ఒకడు దేవుని రాజ్యమును చూడవలెనన్న అతడు తిరిగి జన్మించవలెనని యేసు చెప్పుచున్నాడు. అయితే ఒకడెట్లు జనింపజేయ బడును? దేవుని వాక్యము వలన జనింపచేయబడునని బైబిలు చెప్పుచున్నది. "సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను" (యాకోబు 1:18). "క్రీస్తు యేసునందు సువార్తద్వారా నేను మిమ్మును కంటిని" (1 కొరింధి 4:15). దేవుని వాక్యము వలన క్రైస్తవులందరు తిరిగి జన్మించిరి యని పేతురు ప్రకటించుచున్నాడు: "మీరు క్షయ బీజము

నుండి కాక, శాశ్వతమగు జీవముగల దేవుని వాక్య మూలము
అక్షయ బీజమునుండి పుట్టింపబడినవారు" (1 పేతురు 1:22).

ఒకడు ఆత్మ మూలముగా తిరిగి జన్మించునా? అవును. దే
ములద్వారా పరిశుద్ధాత్ముడు పనిచేయుట వలననేగాని లేఖనము
లేకుండ ఎవనిని ఆయన ప్రత్యక్షముగా మార్చడు. సత్యమువల
అనగా క్రీస్తు సువార్తను విని విధేయత చూపుటవలన క్రొత్త జ
కలుగును.

2. ఒకడు బ్రదికింపబడవలెను. అయితే పాపి యెట్లు బ్రదికిం
బడును? అతడు ఆత్మమూలముగా దేవుని వాక్యమువలన బ్రదికిం
బడును: "నీ వాక్యము నన్ను బ్రదికించి యున్నది. నా బాధలో
నాకు నెమ్మది కలిగించుచున్నది" (కీర్తన 119:50). "నీ ఉపదేశ
వలన నీవు నన్ను బ్రదికించితివి. నే నెన్నడును వాటిని మరువ
(కీర్తన 119:93). "మీ అపరాధముల చేతను పాపముల చేతను మీ
చచ్చినవారై యుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడ బ్ర
కించెను" (ఎఫెసీ 2:1). ఆత్మ జీవింపజేయునని బైబిలు చెప్పుచున్న
(2 కొరింథి 3:6). అయితే ఆత్మ యెట్లు జీవింపజేయును? యేసు యి
చెప్పెను: "ఆత్మయే జీవింపజేయుచున్నది; శరీరము కేవలము
ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మ
జీవమునై యున్నవి" (యోహాను 6:63). గనుక సువార్తద్వా
ఆత్మ జీవింపజేయును.

3. ఒకడు రక్షించబడవలెను. అయితే ఇదెట్లు సాధ్యమగును
ఒకడు దేవుని వాక్యమునకు లోబడుటద్వారా రక్షించ బడును
"అందుచేత సమస్త కల్మషమును, విరవిగుచున్న దుష్టత్వమును మా
లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యము
సాత్వికముతో అంగీకరించుడి" (యాకోబు 1:21). "నీవును, నీ యిం
వారందరును ఏ మాటలవలన రక్షణ పొందుదురో ఆ మాటలు ఆ

నీతో చెప్పునని" తెలియజేయబడగా కొర్నేలి పేతురును తన యింటికి పిలిపించెను (అపొ. కా. 11:14).

4. ఒకడు వెలుగు నొందవలెను. అయితే ఈ వెలుగు ఎట్లు కలుగును? దేవుడు తన వాక్యముద్వారా వెలుగు నిచ్చును: "నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది" (కీర్తన 119:105). "నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును. అవి తెలివిలేనివారికి తెలివి కలిగించును" (కీర్తన 119:130). "యెహోవా ఏర్పరచిన ధర్మము నిర్మలమైనది, అది కన్నులకు వెలుగిచ్చును" (కీర్తన 19:8).

5. రక్షింపబడుటకు ఒకడు విశ్వాసము కలిగి యుండవలెను. అయితే విశ్వాస ఎట్లు కలుగును? అది దేవుని వాక్యము వలన కలుగునని బైబిలు చెప్పుచున్నది: "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడి యుండలేదుగాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30, 31). "బహు తర్కము జరిగిన తరువాత పేతురు లేచి వారితో ఇట్లనెను—సహోదరులారా, ఆరంభమందు అన్యజనులు నా నోట సువార్త వాక్యము విని విశ్వసించులాగున మీలో నన్ను దేవుడేర్పరచుకొనెనని మీకు తెలియును" (అపొ. కా. 15:6, 7).

6. ఒకడు స్వతంత్రుడు చేయబడవలెను. అయితే ఈ స్వాతంత్ర్యము ఎట్లు కలుగును? సత్యముద్వారా స్వతంత్ర్యము కలుగునని యేసు బోధించెను: "మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:32).

7. ఒకడు పిలువబడవలెను. అయితే ఒకడు ఎట్లు పిలువబడును? అతడు సువార్తద్వారా పిలువబడును : "మీరీలాగున రక్షింపబడి, మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని, ఆయన మా సువార్తవలన మిమ్మును పిలిచెను" (2 థెస్స 2:14).

8. ఒకడు ఆకర్షింపబడవలెను. అయితే ప్రజలు ప్రభువు నొద్దకు ఎట్లు ఆకర్షింపబడుదురు? వాక్యోపదేశమువలన ఆకర్షింప బడుదురు. ప్రభువును గూర్చి విని నేర్చుకొనినవాడు ఆకర్షింపబడును. "నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నా యొద్దకు రాలేడు; అంత్యదినమున నేను వానిని లేపుదును. వారందరును దేవుని చేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడి యున్నది గనుక తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును" అని యేసు బోధించెను (యోహాను 6:44-45).

9. ఒకడు పవిత్రపరచబడవలెను. అయితే ఒక వ్యక్తి యెట్లు పవిత్రపరచబడును? అతడు క్రీస్తు రక్తము వలన పవిత్రపరచబడును (1 యోహాను 1:7; 2:2). ఆయన ఉపదేశమునకు లోబడుటద్వారా పవిత్రపరచబడును: "నేను మీతో చెప్పిన మాటనుబట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు" (యోహాను 15:3). "యౌవనస్థులు దేనిచేత తమ నడత శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుటచేతనే గదా?" (కీర్తన 119:9).

10. ఒకడు పరిశుద్ధపరుపబడవలెను. అయితే యెట్లు? ఒకని దేవుడే పరిశుద్ధపరచును (1 థెస్స 5:23). ఒకడు ఆత్మవలన పరిశుద్ధపరచబడునని కూడ బైబిలు బోధించుచున్నది (1 కొరింథీ 6:11). ఆత్మ వాక్యమునకు వేరుగా గాక, వాక్యముద్వారానే పరిశుద్ధపరచును : "సత్యమునందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17).

(సశేషము)

# అద్భుతములు ఆగిపోయెనా?

## (Have Miracles Ceased?)

— A. G. హాబ్స్

దేవుడు మొదటి స్త్రీపురుషులను అద్భుతముగా సృజించెను. అప్పటినుండి మానవజాతి అంతయు ప్రకృతి చట్టము వలన అభివృద్ధి జెందుచున్నది. కావాలంటే నేలమంటితో దేవుడు నరులను సృజించి వారి నాసికారంధ్రములలో జీవపు ఊపిరిని ఊదగలడు. అయితే అట్లు చేయడానికి ఆయన నిశ్చయించుకోలేదని మనందరము ఎరుగుదుము.

బైబిలును సామాన్యంగా చదివే వాడెవయినను, దేవుడు కొంత మందిద్వారా అద్భుతములను చేసెనని గుర్తించగలడు. ఆయన ఇదివరలో మానవులద్వారా అద్భుతములను జరిగించినట్లు ఇప్పుడు జరిగించగలడా? అనునది మన ప్రశ్న కాదు. గాని ఆయన వారికి అట్టి శక్తిని ఇప్పుడు ఇచ్చుచున్నాడా? అనునది మనప్రశ్న. గనుక యిది దేవుని శక్తినిగూర్చిగాక ఆయన సంకల్పమును గూర్చినట్టి ప్రశ్న.

### అద్భుతముల అవుసరత ఇకలేదు.

సత్యమును వ్యాపింపజేయుటకు, స్థిరపరచుటకు దేవుడు పూర్వకాలమందు మానవులద్వారా అద్భుతములను జరిగించెను. ఇశ్రాయేలీయులను విడిపించుటకు మోషే ఐగుప్తునకు వెళ్ళినప్పుడు, అతని పనిని ఫరో యెదుటను ఇశ్రాయేలీయుల యెదుటను దృఢపరచుటకు అద్భుతములను, సూచకక్రియలను చేసేశక్తిని దేవుడతనికి ఇచ్చాడు (నిర్గమ 4:1–8, 29, 30). మొదట అతడు సత్యమును ప్రకటించాడు. దానిని సూచకక్రియలద్వారా ధృవపరచాడు. ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి ఫరో వెళ్ళపోనీయకముందు అతని యెదుట మోషే పది అద్భుత తెగుళ్ళను రప్పింప వలసివచ్చింది.

యేసు చేసిన అద్భుతములు ఆయనపనిని, దైవకుమారత్వమును నిరూపించుటకు చేయబడ్డాయి (మత్తయి 11 : 2-5; యోహాను 20:30, 31). ప్రభువు చేసిన అద్భుతములు, లేక అపొస్తలులు చేసిన అద్భుతములు వారు ప్రకటించిన వాక్యమును స్థిరపరచుటకు చేయబడ్డాయి (మార్కు 16:17-20). వారు ప్రకటించిన సువార్త ఒక క్రొత్తవర్తమానము. దానిని వారు లోకమంతటికి అందించాలి. వారిని క్రీస్తేపంపించెనని వారెట్లు నిరూపించగలరు? బైబిలు లేక క్రొత్త నిబంధన అప్పటికి లిఖింపబడియుండలేదు. అందువలన ప్రభువు వారికి ప్రత్యేక శక్తిని వాగ్దానం చేసాడు (లూకా 24:46-48; అపొ. కా. 1:5, 8). దానిద్వారా ఆయన వారిని పంపిచాడని, వారితోయున్నాడని, వారు సత్యాన్నే బోధిస్తున్నారని వారు లోకాన్ని నమ్మించాలి.

అపొస్తలులు ఇతరులపై చేతులుంచి, వారుకూడా ప్రకటించే వర్తమానం సత్యమని స్థిరపరచునట్లు అద్భుతములు సూచకక్రియలు చేసేశక్తి వారికిని ప్రసాదించిరి (అపొ. కా. 6:6; 8:6, 8, 14-18).

## సత్యము ఇప్పుడు దృఢ పరచబడి యున్నది

అపొస్తలులు సర్వసత్యములోనికి నడిపింపబడునట్లు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును యేసు వారికి వాగ్దానము చేసెను (అపొ. కా. 1 : 5, యోహాను 16:13). ఈవాగ్దానము నెరవేర్చబడెను. (అపొ. కా. 2:4). అందువలన వారు బోధించుట కారంభించినప్పుడు, వెనువెంట జరుగుచువచ్చిన సూచకక్రియలవలన వాక్యమును స్థిరపరచిరి (మార్కు 16:20). సత్యము ఇప్పుడు స్థిరపరచబడియున్నది; "ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసినయెడల ఏలాగు తప్పించుకొందుము! అట్టి రక్షణ ప్రభువుబోధించుటచేత ఆరంభమై, దేవుడు తన చిత్తానుసారముగా సూచక క్రియలచేతను, మహాత్కార్యములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మవరములను అనుగ్రహించుటచేతను, వారితోకూడ సాక్ష్యమిచ్చుచుండగా వినిన వారిచేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2:3, 4).

## సత్యము ఎల్లప్పటికి దృఢపరచబడియున్నది

యేసు దేవుని కుమారుడని మనము నమ్మాలంటే ఆయన మరల వచ్చి లాజరును లేపవలెనా? అద్భుతాలన్నిటిని మళ్లీ చేయవలెనా? మనము నమ్మునట్లు అపొస్తలులు వచ్చి అద్భుతాలన్నిటినీ మళ్ళీ చేయవలెనా? ఒక మనుష్యుడు నిర్దోషియని కోర్టువారు ఒకసారి తీర్పుయిస్తే, అతడు నిర్దోషియని ప్రతిసారి తీర్పుయిస్తూ యుండవలెనా? ఏదైనా సంగతి ఒకసారి దృఢపరచబడితే అది ఎల్లప్పటికీ దృఢపరచబడింది. ఏదైనా సత్యము ఒకసారి దృఢపరచబడితే అది ఎల్లప్పటికీ దృఢపరచబడింది. ఈగొప్ప రక్షణ ఒకసారి దృఢపరచబడింది గనుక అది ఎల్లప్పటికీ దృఢపరచబడినది.

## ఋజువులు వ్రాయబడినవి

ఋజువులు వ్రాయబడి ఇప్పుడు మనకున్నవి ( యోహాను 20:30, 31). అది లిఖింపబడిన దేవుని వాక్యము. వాక్యాన్ని వినుట వలన ఇప్పుడు మనకు విశ్వాసము కలుగును (రోమా 10:17). లిఖింపబడిన వాక్యము దైవజనుని ప్రతిసత్కార్యమునకు సంపూర్ణునిగా చేయుచున్నది (2 తిమోతి 3:16, 17).

ఎవడైనను బైబిలు చెప్పుదానిని నమ్మలేనియెడల, మృతులలో నుండి ఒకడు లేచినను నమ్మలేడు ( లూకా 16 : 19-31 ). ఈనాడు అద్భుతములు చేయుచున్నామని చెప్పుకొనువారు దేవుని సంకల్పమును యెరుగక యున్నారు; నిజానికి బైబిలు బోధించుచున్నరీతిగ రక్షణ దృఢపరచబడియున్నదని వారు నిరాకరింతురు. అద్భుతముల ప్రయోజనం నెరవేర్చబడింది. అందువలన వాటి అవసరత ఇక లేకపోయింది.

## అద్భుతశక్తి సంపాదించే విధానం ఇక లేదు

క్రొత్త నిబంధన కాలములో ప్రజలకు రెండువిధములుగా అద్భుతశక్తి అనుగ్రహించబడినది: 1) పరిశుద్ధాత్మ బాప్తిస్మమువలన (అపో. కా. 2:4, 43). 2) అపొస్తలులు చేతులుంచుటవలన (అపో.కా. 8:14-18; 19:1_7).

పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారి ఉదాహరణలు క్రొత్త
నిబంధనలో రెండే యున్నవి: అపొ. కా. 2:4 లో 12 మంది అపొస్త
లులు దానిని పొందిరి. మరియు అపొ. కా. 10, 11లో కొర్నేలి, అతని
యింటివారు దానిని పొందిరి. అది క్రీ॥శ. 41లో జరిగెను. అది జరిగిన
23 సంవత్సరముల తరువాత "బాప్తిస్మము ఒక్కటే" యున్నదని అపొ.
పౌలు వ్రాసెను (ఎఫెసీ 4:5). అదే సమయములో ఆ బాప్తిస్మము
నీటిలో జరగాలని పేతురు వ్రాసెను (1 పేతురు 3:20, 21). ఇప్పుడు
ఒకేఒక్క బాప్తిస్మమున్నది. అది నీటిలో బాప్తిస్మము. అందువలన
ఇప్పుడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము లేదని మనము ముగింపుకు రావలసి
యున్నది. అందువలన దానిద్వారా అద్భుతములు చేసే శక్తిని యెవరు
పొందజాలరు.

అపొస్తలులందరు చనిపోయారు. అందువలన వారి చేతులు ఎవరి
మీదనైనా యుంచి అద్భుతములు చేసేశక్తిని ఇంకొకరికీయలేరు. అది
అసాధ్యం. ఆశక్తిని ఎవరు ఆరీతిగా పొందలేరు. అద్భుతములు చేసే
శక్తిని యేడుగురు పరిచారకులకు అందించేవరకు యెరూషలేము సంఘ
ములో అద్భుతములు చేయగలిగేవారు అపొస్తలులు మాత్రమే
(అపొ. కా. 2:43; 5:12). పరిచర్య చేయు నిమిత్తము ఆ యేడుగురు
ఏర్పరచు కొనబడినప్పుడు అపొస్తలులు వారిపై చేతులుంచిరి (అపొ.
కా. 6:6). చేతులుంచబడిన వీరు అద్భుతములు చేయగలిగిరి. ఆయేడు
గురిలో స్తెఫను మరియు ఫిలిప్పుకూడా అద్భుతములు చేయగలిగిరి
(అపొ. కా. 6:8; 8:6).

అయితే ఈఅద్భుతవరమును ఫిలిప్పు ఇతరులకు అందజేయలేక
పోయెను. అతడు సమరయకువెళ్ళి వారికి క్రీస్తునుగూర్చి బోధించి, అద్భు
తములద్వారా వాక్యమును దృఢపరచెను. వారిలో అనేకులు నమ్మి
బాప్తిస్మము పొందిరి (అపొ. కా. 8:12). అప్పుడు అపొస్తలులైన
పేతురు, యోహానులు యెరూషలేమునుండి సమరయకువెళ్లి (కొత్తగా

మారుమనస్సు పొందినవారు పరిశుద్ధాత్మ పొందునట్లు వారిపై చేతులుంచిరి. ఈరీతిగా వారుకూడ ప్రకటించు వాక్యము దృఢపరచబడ వీలాయెను (అపొ. 8:14-21).

ఫిలిప్పు ఈశక్తిని ఇతరులకు అందియ్య గలిగినవాడయితే, దాని నందించుటకు అపొస్తలులు ఎందుకు రావలసివచ్చెను? అపొస్తలులు ఈశక్తిని ఎవరికి అందించారో దానిని వారు ఇంకొకరికి అందియ్యలేక పోయినట్లు దీనివలన ఋజువగుచున్నది. వారు ఇయ్యగలిగినను వారందరు ఇప్పుడు చనిపోయారు. అపొస్తలులందరు కాలాన్ని ఎప్పుడో విస్మరించేశారు మరియు ఇప్పుడు పరిశుద్ధాత్మ బాప్తిస్మములేదుకూడా. అందువలన అద్భుతములు చేసేశక్తిని పొందేవిధానముఇప్పడు లేనేలేదు.

(సశేషము)

# పరిశుద్ధాత్ముడు — వ్రాయబడిన వాక్యము

బైబిలు సామాన్య మానవులు వారి సామాన్య జ్ఞానము నుపయోగించి వ్రాసిన గ్రంథమని కొందరు భావింతురు. కాని నిజమునకు బైబిలు పరిశుద్ధాత్మచే వ్రాయబడినది. అందులో దేవుని మనస్సు స్పష్టముగా కానవచ్చును. బైబిలు తనంతట తాను ఆత్మావేశము వలన కలిగినదని, దేవుని వాక్యమని నిరూపించుకొనుచున్నది. దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకు ప్రయోజనకరమైనది (2 తిమోతి 3:16, 17). అది ఏ మానవుని స్వంత ఊహలను బట్టి వ్రాయబడినది కాదు. ప్రవచనము ఊహనుబట్టి పుట్టదు (2 పేతురు 1:20, 21). పౌలు ప్రకటించిన సువార్త మానవులచేత అందింపబడి, ప్రచురింపబడినది గాక యేసుక్రీస్తువలన తెలియజేయబడెను (గలతీ 1:11, 12). అదియుగాక, దైవప్రేరితములైన లేఖనములు ఎన్నడూ నిరర్థకము కానేరవని క్రీస్తు వక్కాణించెను (యోహాను 10:35).

లేఖనములు రోమా 1:2 లో పరిశుద్ధ లేఖనములుగా వర్ణించ బడెను. క్రీస్తు సువార్త పరిశుద్ధ లేఖనములలో గుప్తమై యున్నది. వీటిని పౌలు దేవోక్తులు అని పలికెను (రోమా 3:2); మరియొకచోట శక్తిగల పరిశుద్ధ లేఖనములు అను మాటతో సంబోధించెను (2 తిమోతి 3 : 15).

**పరిశుద్ధాత్ముడు దేవుని మాటలనే పలికెను :** తమ యందున్న క్రీస్తు ఆత్మ, క్రీస్తు విషయమైన శ్రమలను గూర్చియు, కలుగబోవు మహిమను గూర్చియు సాక్ష్య మిచ్చెనని 1 పేతురు 1:11 లో వ్రాయబడెను. సత్యస్వరూపియైన ఆత్మ వచ్చి, క్రీస్తునుగూర్చి సాక్ష్య మిచ్చెను (యోహాను 15:26). దేవుని యొక్క మర్మములు ఆత్మ మూలముగా దేవుని పరిశుద్ధులగు అపొస్తలులకును, ప్రవక్తలకును, బయలుపరచబడెను (ఎఫెసీ 3:5). థెస్సలోనీకయలోని వారందరు అపొస్తలునిద్వారా దేవుని గూర్చిన వర్తమాన వాక్యము విని, అది పరిశుద్ధుడైన దేవుని వాక్యమని అంగీకరించిరి (1 థెస్స 2:13).

**వాక్యముద్వారా పరిశుద్ధాత్ముడు వారి పాపములను గూర్చి ఒప్పించి, వారిని మార్చును :** మనుష్యులు తమ పాపములను గుర్తించి, విడిచిపెట్టునట్లుగా వాక్యము చేయగలదు. శాశ్వతమగు జీవముగల అక్షయ బీజమునుండి పుట్టింపబడుటకు అవకాశము మెండుగా గలదు (1 పేతురు 1:23). పాపములను గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు లోకమును ఒప్పుకొనజేయుటలో పరిశుద్ధాత్మ పాత్ర అద్భుతములు చేయు ప్రత్యేకమైనది కాదు గాని, వాక్యరూపములో ఆత్మ పనిచేయుచునే యున్నాడు.

పెంతెకొస్తు దినమున పరిశుద్ధాత్మ మాటలవలన యూదులు మారుపు నొందిరి (అపో. కా. 2:37, 38). సమరయ ప్రాంతంలో ఫిలిప్పు సువార్త ప్రకటించిన సమయమున పురుషులు, స్త్రీలు నమ్మి బాప్తిస్మము పొంది రక్షింపబడిరి. త్రోవలో వెళ్లుచున్న నపుంసకుడు

ఒప్పింపబడి రక్షణపొందెను (అపొ. కా. 8 : 37). కొరింథీయులలో అనేకులు విని, విశ్వసించి, బాప్తిస్మము పొందిరి (అపొ. కా. 18:8). దేవుని వాక్యము ప్రకటింపబడనిచోట, ప్రజలు మార్పు నొందుట అసాధ్యము. దేవుని వాక్యము శక్తిగలది, అది మనుష్యుల హృదయములను ఛేదించగలది. కారణం పరిశుద్ధాత్మావేశమైనది. ప్రజలు ఆత్మానుసారముగా నడిపింప బడుచుంటిమని చెప్పుచూ, వాక్యమును త్రోసివేయుట జరుగుచున్నది. ఆత్మానుసారముగా నడచుకొనవలెనని కాంక్షించువారు, తప్పక బైబిలును అనుసరించవలెను.

—A. సత్యవర్ధనరావు – కాకినాడ.

---

### యేసును వెంబడించిన పండ్రెండుగురు - 8

## మత్తయి : క్రీస్తు శిష్యుడయిన సుంకరి

*(Mathew, The Publican who became A disciple)*

అలనాడు పాలస్తీనాలోని కపెర్నహోములో ప్రభుత్వ సుంకరియగు లేవీ తన ఆఫీసులో పని చేయుచుండెను. పన్ను కట్టినవారి యొక్కయు, కట్టనివారియొక్కయు జాబితాను తయారుచేయుచుండగా లేవీ తన సొంత పరిస్థితిని గూర్చి ఆలోచించుకొనసాగెను. రోమా ప్రభుత్వపు సేవకుడు గనుక, తన ప్రజలచే ద్వేషింపబడే రాజకీయ పద్ధతిలో ఒక భాగముగా అతడు ఉండెను. తన ప్రజలు దేశభక్తి గలిగినవారు గనుక అతడు యూదుల వ్యతిరేకియని, సమాజ ద్రోహియని అతనినిగూర్చి వారనుకొనుచుండిరి. రోమాదేశపు ఆక్రమణ సైన్య బలముక్రింద లేవీలాంటి వ్యక్తి పాలస్తీనా దేశభక్తి పౌరుల నుండి పన్ను వసూలుచేయుచు వాటిలో తన సొంత జేబులను నింపుకొననిచ్చుచున్న ప్రభుత్వమును వారు ద్వేషించుచుండిరి. రోమా

దేశమునకు పన్ను వసూలుచేయుట ఆపలేకను, వారి దేశమునుండి రోమా సైన్యమును వెళ్ళగొట్టలేకను ఉండుటచే, వారికున్న ఒకే ఒక్క ఆయుధముతో అతనిపైకి వారు లేచిరి – సాంఘికంగా వారతని వెలివేసిరి. తన పూర్వ మిత్రులు ఇక అతనితో మాటలాడుట మాని వేసిరని అతడు వెంటనే గమనించెను. తన మతగురువు లతని బహిష్కరించిరి; వారి న్యాయస్థానములలో అతనికి చోటు లేకపోయెను. ఈ పరిస్థితుల్లో అతడు తన యూదా సహోదరులను మరచి, వారిని పాలించుచున్న రోమాదేశపు అధికారుల సమాజంలో చేరవలెనా? ఈ సుంకపు గుత్తదారులు సామాన్య నేరస్థులవలె, దేశద్రోహులవలె సమాజంలో తమ స్థానాన్ని కోల్పోయినట్టివారని అతడు వెంటనే గ్రహించెను.

అందువలన సాంఘికంగా వెలివేయబడిన వారిని కనుగొనుట కంటె లేవీకి వేరొక మార్గము లేకపోయింది. వారు సంఖ్యలో తక్కువేమీ కారు. ఎందువలనంటే ఆరోజుల్లో రాజకీయ మతపరమైన 'చట్టమును' ప్రత్యక్షముగానో పరోక్షముగానో ఉల్లంఘించిన వారందరు పాపులని పరిగణింపబడేవారు. లేవీయు, మిగిలిన సుంకపు గుత్తదారులును వారి వృత్తివలన పాపులని పరిగణింపబడ్డారు. ధర్మశాస్త్రముయొక్క సూక్ష్మవిధులను ఆచరించలేనట్టి, పేదతనమువలన దశమభాగముగాని వివిధ అర్పణలుగాని అర్పించలేనట్టి ప్రజలలో వారొకరైరి. సుంకరులు, చోరులు, జారులు, మోసగాళ్లు వీరందరు వెలివేయబడినవారే. వారిని తమ కులంలోనికి మరలా చేర్చుకొనే అవకాశమేమీ లేదని పరిసయ్యులు, ధర్మశాస్త్రోపదేశకులు వారికి విపులంగా తెలియజేసి యుండిరి.

అందువలన కపెర్నహూములోని తన ఆఫీసులో పనిచేయుటకు ఆ రోజు లేవీ యథావిధిగా సంసిద్ధుడయ్యాడు. జీవితం అంతా ధనార్జనే కాదని అతడు గ్రహించాడు. పరులకు తాను చేసిన వంచనవలన భార

భరితుడయ్యాడు. ధర్మశాస్త్రాన్నిబట్టి తన మోక్షాన్ని గూర్చి ఆలోచించసాగాడు...ఇంతలో అతనికొక పిలుపు వచ్చింది! యేసును గూర్చి కొన్ని వారాలుగా లేవీ వింటున్నాడు గాని ఆయన ఇప్పుడతని ఆఫీసు ముందునుండే వెళ్లుచున్నాడు. అతన్ని చూచి 'నన్ను వెంబడించుము' అన్నాడు. అప్పటినుండి మత్తయి అని పిలువబడిన లేవీ ఈలోకాన్నంతటిని తలక్రిందులుచేసిన ఆ జీవితమునకు వ్యక్తిగత సాక్షి అయ్యాడు. ఈ మనుష్య కుమారునితోను దేవుని కుమారునితోను అతని కున్న సంబంధం అతని జీవిత మార్గాన్ని సంపూర్తిగ మార్చివేసింది. ఈ లోకంలో ద్వేషింపబడిన వారికి యేసు యిచ్చిన పిలుపుకు అతడొక గొప్ప మాదిరియై యున్నాడు.

యేసుప్రభువు ప్రతివిధమైన సాంఘిక, రాజకీయ, జాతీయ ప్రవృత్తులలో నున్న వారిని ఒకే సహవాసములో యుండుటకు పిలువడానికి వచ్చాడు. ఎవరికైతే రక్షణలేదని పరిసయ్యులు కేవలం విసర్జించారో వారికే రక్షణ నందించుట కాయన వచ్చాడు. మనం సిద్ధాంత (బోధ) రీత్యా పవిత్రత కలిగి యున్నను, సమాజంలో యున్న అన్ని తెగలవారిని ఆయనకొరకు జయించాలని యేసు జీవితం మనకు బోధించుచున్నది.

ఈనాటి మన సమాజం ఆనాటి పరిసయ్యుల కేమీ తీసిపోదు. మనచుట్టూ యున్న లోకంలో మత శాఖల వెంబడి శాఖలు పరిసయ్యులవంటి సంకుచితసూత్రములపై ఆధారపడి స్థాపింప బడుచున్నట్లు చూడగలము. ఇది ఇట్లుండగా మనకు మనమే పరీక్షించుకొందము. అన్ని కులస్థులకు, తెగలవారికి, భాషలు మాట్లాడువారికి సువార్త బోధించుటకు సంసిద్ధులముగా యున్నామా? పట్టణాల్లోనే కాదు, పల్లెలకు, మారుమూలలకు వెళ్ళి క్రీస్తులోని సమానత్వాన్ని బోధించుటకు సిద్ధముగా యున్నామా? క్రీస్తులో అగ్రకులస్థులు, అంటరానివారు ఒకే సహవాసములో యుండుట సాధ్యమే. మొదటి శతాబ్దములో

యేసు పరిసయ్యులను ఖండించి మత్తయిలాంటి వారికి తన హస్తాన్ని అందజేస్తాడు. ఆయన ఈనాడు ఎవరిని ఖండిస్తాడో? ఎవరికి తన హస్తాన్ని అందజేస్తాడో? —G. R. వేంకర్ ఫూల్.

## విభజింపబడి యుండ వద్దు

## *( Be Not Divided )*

యేసు ప్రభువు తన శిష్యులందరు ఏకమై యుండవలెనని అత్యాశ కలిగి యుండెను. యోహాను 17:20, 21 లో ఆయన ఇట్లు ప్రార్థించెను: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెనని వారి కొరకు మాత్రమే గాక వారి వాక్యమువలన నాయందు విశ్వాసముంచువారందరు ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను." అయినను ఈనాడు క్రైస్తవ లోకమును పరికించిన యెడల, క్రీస్తుకు చెందినవారమే అని చెప్పుకొను వందలకొలది వివిధ సంఘములను కనుగొందుము. అయితే యేసు ప్రభువు కోరినది అట్టిది కానేకాదు.

మత్తయి 16:18 లో, "నా సంఘమును కట్టుదును" అని ప్రభువు వాగ్దానము చేసెను. ఒకటికంటె ఎక్కువ సంఘములను స్థాపించుటకు ఆయన ఎన్నడు సంకల్పించలేదు. నిజానికి ఆయన ఒకే ఒక్క సంఘమును స్థాపించాడు. మిగిలిన సంఘము లన్నిటిని మానవులు తమ సిద్ధాంతములను, ఆచారములను వారిచే నిర్ణయించబడిన పేరులను కలిగి యుండుటకు మానవులచే స్థాపించబడినవి.

మానవునిదైన ఏ సంఘములోను మానవుడు రక్షణను కనుగొనలేడని మనం గ్రహించాలి. రక్షణ క్రీస్తు నామములోనే యున్నదని సంఘము క్రీస్తుయొక్క శరీరమై యున్నదని అపొస్తలులు బోధించారు (అపొ. కా. 4:12; ఎఫెసీ 1:22, 23).

క్రీస్తులోనికి ప్రవేశించాలని కోరువారందరు ఆయన నిర్ణయించిన రీతిగానే ఆయనలో ప్రవేశించుదురుగాక (గలతీ 3:27). యేసు ప్రభువు దేవుని కుమారుడని విశ్వసించుము (యోహాను 8:24). విశ్వాసముతో నీ పాపములను గూర్చి మారుమనస్సు నొందుము, యేసే దేవుని కుమారుడని నీవు నమ్ముచున్నట్లు ఒప్పుకొనుము, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము (రోమా 10:10; అపో. కా. 8:37, 38; 2:38). ప్రభువే నిన్ను తన సంఘములో చేర్చుకొనును (అపో. కా. 2 : 47).

మానవులతో ఆరంభించబడిన ఉపదేశమును దేనినీ మనం అనుసరించరాదు; సరిగదా బైబిలులో ఉపదేశించబడిన దానినే మనం అనుసరించాలి. ఏ మానవుని సంఘములోను మనం ఉండకూడదు; సరిగదా మనందరం క్రీస్తు స్థాపించిన సంఘములో యుండి, క్రైస్తవులుగా మాత్రమే యుండాలి. బాప్తిస్మములో నీ జీవితాన్ని క్రీస్తుకు సమర్పించుకో. ఆయన క్రొత్త నిబంధనలో ఏమి చెప్పుచున్నాడో దాన్ని చెయ్యి. ఆయనయందు సంపూర్తిగ నమ్మిక యుంచు. నీవలె యున్న యితర క్రైస్తవులతో కలసి పనిచెయ్యి. క్రీస్తు ప్రార్థించింది ఇట్టి ఐక్యతకొరకే!

— రోజర్ ఫిఫ్ట్ లెట్

గమనిక : 231 పాటలుగల క్రైస్తవ కీర్తనల పుస్తకాన్ని మీ సంఘాలలో వాడండి. ఫుల్ క్లాత్ బైండింగ్ పుస్తకం రూ. 5-50; సగం క్లాత్ బైండింగ్ పుస్తకం రూ. 4/- మాత్రమే. పోస్టేజీ అదనం. సత్యవాణి కార్యాలయానికి ఈ రోజే M. O. చేసి పొందండి.

# తండ్రితో మాట్లాడుము

## ( *Talk to the Father* )

క్రైస్తవుడా, దేవుని సహాయం లేకుండా ఒక్కరోజైనా నీవు గడపగలవా? నీవాయనను నమ్మకుండ, అడుగకుండ ఆయన నీకు ఎట్లు సహాయం చేయగలడు? దేవుడు తన సహవాసాన్ని ఉచితంగా అందించుచున్నప్పుడు ఆయనను వదిలేసి నీ పనులను చేసికొనుటకు ప్రయత్నించుచున్నావా? నీ భారములు నీ వొక్కడవే మోయనవసరం లేదు. నీవడిగితే వాటిని ఆయనే మోయుటకు సంసిద్ధుడై యున్నాడు.

“ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి” (1 పేతురు 5:7). “దేవుని ప్రేమించు వారికి... మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవి” (రోమా 8;28). మన జీవితములను పరీక్షించుకొందాం. మన ప్రభువుతో మాట్లాడుచు ఎక్కువ సమయాన్ని ప్రతిరోజు గడుపుదాం. క్రైస్తవ జీవితానికి మరింత మెరుగు పెట్టుదాం.

---

Regd. No. H/KD-45/KD H.O.

*From*
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA-533 001

To
.............................................
.............................................
.............................................
.............................................